సాక్షి

అన్నమయ్య జిల్లా

బుధవారం ׀ 4 ׀ జూన్ ׀ 2025



ఉజ్వల భవితకు 'నవోదయ'ం

నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే.. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడినట్లే. 2026-2027 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. - 8లో



ఈ 'పాప'ం ఎవరిది!

మూడు రోజుల క్రితం జన్మించిన మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకొచ్చి గడ్డివామి వద్ద వదిలేసి వెళ్లారు. ఈ సంఘటన వీరబల్లి మండలంలో జరిగింది - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.200
రెండోరకం	రూ.120	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1807 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పీఎంఎస్ పథకంపై విస్మృత ప్రచారం చేయాలి



విద్యుత్ అధికారులతో సమీక్ష చేస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్ జానకిరామ్

రాయచోటి : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించాలని విద్యుత్ చీఫ్ జనరల్ మేనేజర్ జానకిరామ్ ఆదేశించారు. మంగళవారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా ఎస్ఈ కార్యాలయంలో పీఎంఎస్ పథకం అమలు విధివిధానాలపై ట్రాన్స్‌కో అధికారులతో ఆయన సమీక్షించారు. వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆయన సూచించారు. జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించే విషయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అన్నమ య్య జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, రాయచోటి, పీలే రు, రాజంపేట, మదనపల్లి డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.యుగంధర్, వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, గంగాధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

5న పర్యావరణ దినోత్సవ వేడుకలు

– జిల్లా కలెక్టర్ శ్రీధర్



రాయచోటి : రాజంపేటలో ఈ నెల 5న నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ వేడుకలు, 7న నిర్వహించబోయే యోగా కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మీడియాకు వివరించారు. మంగళవారం సాయంత్రం రాయ చోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. రాజంపేటలోని నగరవనంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో 5 లక్షల మొక్కలు నాటుతామన్నారు.

నాటుసారాపై ఫిర్యాదు చేయండి

రాయచోటి : అన్నమయ్య జిల్లాను నాటుసారా రహితంగా రూపొందించడమే లక్ష్యంగా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాటుసారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 191 కేసులు నమోదు చేయగా, 169 మందిని అరెస్టు చేశారని, 11,224 లీటర్ల నాటుసారా సీజ్ చేశామన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, సూపరింటెండెంట్ జి మధుసూదన్, సహాయ సూపరింటెండెంట్ వై జోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నయవంచనకు ఏడాది

- ఎన్నికల ముందు అధికారం కోసం హామీల వల
- అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా నెరవేర్చని కూటమి సర్కార్
- రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు ఇలా అందరికీ వెన్నుపోటు
- జిల్లాలో విచ్చలవిడిగా ఇసుక, మట్టి తవ్వకాలు
- దాడులు, వేధింపులతో సాగుతున్న పాలన
- వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్ వాహన ఆపరేటర్ల తొలగింపు
- నేడు జిల్లాలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటుపై నిరసనలు
- భారీ ఎత్తున నిర్వహించేలా సన్నద్ధమైన పార్టీ శ్రేణులు



సాక్షి రాయచోటి : పేదల సంక్షేమం ఒకవైపు....అభివృద్ధి మరోవైపు పరుగులు తీసిన పరిస్థితి నాటిది...ఇంటింటికి ఫలాలు అందడం...సేవలకు కేరాఫ్ సచివాలయం అన్నది ఇంతకుముందున్న ప్రభుత్వంలో నెలకొన్న పరిస్థితి. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా అండగా వలంటీర్ ఉన్నాడన్న ధైర్యం....మహిళలకు ఎన్నో పథకాలు...అలాగే రైతులకు వ్యవసాయంలో ఒక భరోసా....పేద ప్రజలకు ఆరోగ్య పరంగా నేనున్నాన్న గుండె ధైర్యాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. పేద విద్యార్థులను ఇంజనీర్లు, డాక్టర్లను చేయాలన్న సంకల్పం దిశగా భవిష్యత్ ఆలోచనతో అడుగులు వేశారు. అయితే ప్రస్తుత సర్కార్ పేద ప్రజలకు సంక్షేమం బదులు కష్టాలు తెచ్చిపెట్టింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో పథకాలకు పేర్లు మార్చిందే తప్పా.. సంక్షేమం దిశగా అడుగులు పడటం లేదు. ఎక్కడ చూసినా కుట్రలు, కుతంత్రాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు, ఆక్రమణలు, ఇసుక, మట్టి దోపిడీతో కూటమి సర్కార్ పాలన చేస్తోంది. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ అంటూ ఆర్భాటంగా పథకాలు ప్రకటించి...అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ఏడాది గడిచిపోయింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూటమి సర్కార్ వంచన, దగ, మోసం, కుట్రలపై వెన్నుపోటు దినం పేరుతో బుధవారం పెద్దఎత్తున ప్రజా ఆందోళనకు పిలుపునిచ్చింది.

ఎన్నికల సభల్లోనూ ఎన్నెన్నో..

ఎన్నికలకు ముందు రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లెల్లో చంద్రబాబుతోపాటు పవన్ కల్యాణ్ విస్తృతంగా పర్యటించారు. ఎన్నెన్నో హామీలు గుప్పించారు. రైల్వేకోడూరులో మామిడికి సంబంధించి పండ్ల రసాల పరిశ్రమ తెరిపించడం, అంతేకాకుండా మామిడికి సంబంధించి పరిశ్రమలు పెడతామన్నా దిక్కులేదు. జిల్లాలో హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామన్నా ఇంతవరకు అతీగతీ లేదు. రాయచోటికి సంబంధించి అనేక హామీలు గుప్పించినా కార్యరూపం దాల్చలేదు. మదనపల్లె, రాజంపేటలను జిల్లా చేస్తామని హామీ ఉన్నా ఆచరణ సాధ్యం కాలేదు. రాజంపేటలో మెడికల్ కాలేజీ తీసుకు వస్తామన్నా ఇప్పటికీ లేదు. అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నా వైఎస్సార్ సీపీ హయాంలో టెండర్ల వరకు వచ్చిన ప్రక్రియను కూడా నిలిపి వేశారు. మదనపల్లెలో రోడ్ల అభివృద్ధికి...ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి అడుగులు పడలేదు.

బాబు మాటలు నీటిమీద రాతలు

ప్రస్తుత సీఎం చంద్రబాబు మాటలు నీటిమీద రాతలుగా తేలిపోతున్నాయి. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కనిపించడం లేదు. పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది అవుతున్నా తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ ఇలా చెబుతూపోతే సూపర్‌సిక్స్ పథకాలకు ఇంకా మోక్షం లభించలేదు. బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ అని అర్థమవుతోంది. ఇంటింటికి ఉద్యోగం లేదు...నిరుద్యోగ భృతి లేదు....ఇదే కాదు...అనేక రకాలుగా చెప్పిన హామీలు ఏవీ కూడా అమలుకు నోచుకోలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చినా అదీ కూడా అరకొరగా అందిందే తప్ప పూర్తి స్థాయిలో సబ్సిడీ అందుకున్న పరిస్థితి లేదు.

ఇసుక, మట్టి దోపిడీ

జిల్లాలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎక్కడికక్కడ ఇసుకను పార్టీ కీలక నేతలే భాగస్వాములై సరిహద్దులు దాటిస్తున్నారు. చెయ్యేరు నదిని లూటీ చేస్తున్నా అడిగే వారే లేరు. అంతేకాకుండా రాత్రిళ్లు పెద్దపెద్ద టిప్పర్లతో ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో చాలాచోట్ల మట్టిని కూడా అలాగే అమ్మేస్తున్నారు. చెరువుల్లోనూ తవ్వకాలు చేపట్టి మట్టిని అమ్ముకుంటుండగా గుట్టలను కూడా చదును చేస్తున్నారు. ఇలా ఒకటేమిటి చెప్పుకుంటూపోతే కబ్జాలు పెరిగిపోయాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికార పార్టీ నాయకుల ఆగడాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల ఆగడాలు మితిమీరుతున్నా అడిగే దిక్కు దివానం లేని పరిస్థితి నెలకొంది. మరోపక్క ఎక్కడికక్కడ అక్రమ కేసులు బనాయించడం, దౌర్జన్యాలు, బెదిరింపులు కూడా కొనసాగిస్తున్నారు. మదనపల్లెకు మెడికల్ కళాశాల మంజూరైనా వాటి సీట్లను కూడా ఇవ్వకుండా ప్రైవేటు పరం చేసేందుకు అడుగులు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా అభివృద్ధిని కూటమి సర్కార్ విస్మరించిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ సంక్షేమం

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికి సంక్షేమం అందించారు. విద్యార్థులు ,రైతులు.. ఇలా ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని పంచారు. సచివాలయాల ద్వారా 540 సేవలు, వలంటీర్ల ద్వారా ఇంటింటికి ఫలాలు అందించి వైఎస్సార్ సీపీ సర్కార్‌చరిత్రలో నిలిచిపోయింది. ఇంకా అనేక రకాల పథకాలతో మహిళలను మహారాణులుగా మార్చారు. పరిశ్రమలకు పెద్దపీట వేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ఎక్కడికక్కడ పారిశ్రామిక వాడల నిర్మాణాలు చేపట్టారు. జిల్లా కేంద్రమైన రాయచోటిని విస్తృతంగా అభివృద్ధి చేశారు. మదనపల్లెలో మెడికల్ కాలేజీని అద్భుతంగా నిర్మిస్తున్నారు. అన్నిచోట్ల వంద పడకల ఆస్పత్రులు, పల్లె ముంగిట సచివాలయాల నిర్మాణాలతో వైఎస్ జగన్ సర్కార్ హయాంలో కొత్త కళ సంతరించుకుంది.

అన్నమయ్య సన్నిధిలో 7న యోగాంధ్ర

- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : ఈనెల 7న తాళ్లపాక అన్నమయ్య సన్నిధిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం రాయచోటిలో పత్రికలకు అందజేసిన ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. పదకవితా పితామహుడు, తిరుమలేశునిపై 32వేల సంకీర్తనలు రచించిన సంకీర్తనాచార్యుడు, అన్నమయ్య నడియాడిన నేలలో ఆయన పేరుతో అన్నమయ్య జిల్లా ఏర్పడింది. ఈ ఏడాది మే 9న 617 వసంతాలు పూర్తి చేసుకున్న అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకొని ఆయనను స్మరిస్తూ తాళ్లపాకలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద జూన్ 7న ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు 617 మందితో యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు.

32 వేల మందితో.....

తిరుమలేశునిపై 32వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్యకు ఘన నివాళి గా అదేరోజున జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో 32వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

రాయచోటి : 65 సంవత్సరాల పైబడిన వారు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. రేషన్ షాపుల వద్దకు వారు రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అన్నమయ్య జిల్లాలో చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీపై కలెక్టర్ పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో మొదటి 3 రోజులలోనే వికలాంగులు, 65 సంవత్సరాల పైబడిన వారి కార్డులలో 57.79 శాతం కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ పూర్తయిందన్నారు. జిల్లాలో 1123 చౌకదుకాణాలు ఉండగా 4,97,969 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. రేషన్‌కార్డుల ద్వారా 14,82,094 మంది సభ్యులు రేషన్ ద్వారా లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు.

వెన్నుపోటు దినంలో కదం తొక్కాలి

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఆకేపాటి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని కూడా నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేసి వెన్నుపోటు పొడిచినందున మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజంపేట పట్టణం జీఎంసీ కళ్యాణ మండపంలో మంగళవారం వెన్నుపోటు దినం రాజంపేట కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, మాట్లాడారు. జగన్ మళ్లీ సీఎం అయివుంటే వివిధ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రెండు లక్షల రూపాయిలు వచ్చేదన్నారు. అయితే చంద్రబాబు సీఎం కావడంతో ప్రజలకు ఒక్క రూపాయి కూడా లబ్ధి చేకూరలేదన్నారు. పథకాలు అందక పోవడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని తెలిపారు. ఈకారణంగా వెన్నుపోటు దినంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. దేశంలో అధికారం చేపట్టిన ఏడాదిలోనే ప్రజాగ్రహానికి గురైన ఏకైక సీఎం చంద్రబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పదికి పది సీట్లు గెలుస్తామని చంద్రబాబు మహానాడు వేదికగా చెప్పారన్నారు. అయితే జిల్లాలోని తమ పార్టీ ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తారని, టీడీపీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు పాలనపై నమ్మకం ఉంటే రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి వచ్చి తలపడాలని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ సవాల్ విసిరారు. రాజీనామా చేస్తే ఉప ఎన్నికలు వస్తాయని ఉప ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో ఉన్న పది సీట్లలో టీడీపీ ఒక్కసీటు గెలిచినా తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని, అందుకు బాబు సిద్ధమా అని ఎమ్మెల్సీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్, బీసీసెల్ నాయకుడు వడ్డే రమణ, మహిళా విభాగం ప్రతినిధులు రక్కాసి శ్రీవాణి, మిర్యాల సురేఖ, సుజాత, ఆరెళ్ళ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెప్పండి

- సూపర్ సిక్స్‌కు దిక్కులేదు
- కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టండి
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పిలుపు



కురబలకోట మండలంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నాయకులతో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

కురబలకోట : సీఎం పదవి కోసం కాళ్లు కడిగి కన్యాదానం చేసిన సొంత మామ ఎన్టీఆర్‌ను నాడు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు.. ఆపై మామ పార్టీని నిర్దాక్షిణ్యంగా లాక్కున్నారు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయక నేడు మరోసారి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారు.. రాష్ట్ర సీఎం వైఖరిని నిరసిస్తూ బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినంలో వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాలు, అభిమానులతోపాటు ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఆ పార్టీ రాష్ట్ర కీలక నాయకులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం కనసానివారిపల్లె గ్రామ సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి గృహం వద్ద నియోజక వర్గ నాయకులు వారికి మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి ఇచ్చిన హామీలను అటకెక్కించి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని నిరసించాలన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితం వెన్నుపోటుతో కూడుకున్నదన్నారు. చంద్రబాబు మోసాలకు, వెన్నుపోటుకు పేటెంట్ లాంటి వాడన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఏడాది కావస్తున్నా ఇంత వరకు ఒక్క కొత్త దివ్యాంగుల ఫించన్‌గాని, వృద్ధాప్య ఫించన్ గాని ఇచ్చిన పాపాన పోలేదన్నారు. భర్తను కోల్పోయిన ఎందరో వితంతువులు ఫించన్ కోసం ఎదురు చూస్తున్నా ఈ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఆపై సూపర్ సిక్స్ పథకాలకు దిక్కులేదన్నారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి మాయ మాటలతో కాలం వెళ్లదీస్తున్న ఇంత అధ్వాన్న ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదన్నారు. ప్రచార ఆర్భాటం తప్ప కూటమి ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగింది ..జరిగింది శూన్యమన్నారు. వెన్నుపోటు అంటే చంద్రబాబు, చంద్రబాబు అంటే వెన్నుపోటు గుర్తుకు వస్తాయన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఈ నిరసన చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని దగా చేసిన కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వెన్నుపోటు దినంను విజయ వంతం చేసి కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపించాలని కోరారు.

ఖరీఫ్‌కు కష్టకాలం!

- దుక్కులు దున్ని విత్తనకాయల కోసం ఎదురుచూపు
- వేరుశనగ రైతుపై కక్షగట్టిన కూటమి ప్రభుత్వం
- 55,066 క్వింటాళ్ల విత్తనకాయలు అడిగితే 36,034 క్వింటాళ్లకే మంజూరు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అడిగినంత ఇచ్చిన వ్యవసాయశాఖ
- వర్షాభావంతో తగ్గిపోతున్న పంటల సాగు విస్తీర్ణం
- దీంతో 2025 ఖరీఫ్ ప్రణాళికను కుదించిన వ్యవసాయశాఖ



బి.కొత్తకోట మండలంలో దుక్కులు దున్ని విత్తేందుకు సిద్ధమైన పొలాలు

బి.కొత్తకోట : జిల్లాలో ఖరీఫ్ సాగుకు కష్ట కాలమొచ్చింది. ఏటా సాగు అంచనాలకు అనుగుణంగా రైతాంగానికి విత్తనకాయలను సరఫరా చేయాల్సిన కూటమి ప్రభుత్వం ప్రస్తుత ఖరీఫ్‌లో కోత విధించింది. ఇచ్చిందే తీసుకోండి అంటూ వేరుశనగ విత్తనకాయలను కేటాయించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా వ్యవసాయ ప్రణాళిక ప్రతిపాదనలో ఎంత పరిమాణంలో విత్తనకాయలపై ప్రతిపాదిస్తే అంతే పరిమాణంలో కేటాయింపులు చేశారు. ప్రస్తుతం ఈ పరిస్థితి తలకిందులైంది. భారీగా కోత విధించిన ప్రభుత్వం రైతులను ఇబ్బందుల్లోకి నెట్టింది. కాగా విత్తనకాయల పంపిణీ ప్రారంభం కాకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు.

19,032 క్వింటాళ్ల తగ్గింపు

ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో 62,890 హెక్టార్లతో అన్ని పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో వేరుశనగ సాగు చేసే రైతాంగానికి 55,066 క్వింటాళ్ల విత్తనకాయలు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం అందులో కోత విధించి 36,034 క్వింటాళ్ల విత్తనకాయలు మాత్రమే మంజూరు చేస్తూ కేటాయించింది. ఈ కేటాయింపు విత్తనకాయల సరఫరాలోనూ తీవ్ర జాప్యం చేస్తోంది. ఇప్పటికే విత్తనం సిద్ధం చేసుకోవాల్సిన రైతులు విత్తనం కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు పంటల సాగుపై ఆశలు పెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో వేరుశనగ రైతులకు అవసరమైన విత్తనకాయలను ప్రభుత్వం పంపిణీ చేసే పరిస్థితుల్లో లేకపోవడం రైతుల్లో ఆందోళనకు గురిచేస్తోంది. దీనితో వ్యాపారుల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన విత్తనకాయలను ఇంకా పంపిణీ ప్రారంభించలేదు. ప్రస్తుతానికి సరఫరా అయిన ఐదువేల క్వింటాళ్ల విత్తనకాయలను మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని మండలాలకు తరలించారు. ఇవి ఏ మూలకు సరిపోవు.

గత ప్రభుత్వంలో అడిగినంత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళిక ప్రతిపాదన మేరకు ఒక్క కింట్వా కూడా తగ్గకుండా కేటాయింపు జరిగేవి. 2022లో 59, 410 క్వింటాళ్లు, 2023లో 51,707 క్వింటాళ్లు, 2024లో 55,066 కింట్వాళ్లు కావాలని ప్రతిపాదించగా ఇంతే పరిమాణంలో కేటాయించారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీనితో రైతులకు ఇబ్బందులు తప్పవు.

- కాగా జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయం తగ్గిపోతోంది. 2025లో 62,890 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా 2,493 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం తగ్గించారు. 30 మండలాలు కలిగిన చిన్న జిల్లాలో ఈ స్థాయి విస్తీర్ణంలో పంటలు సాగు కావడం లేదంటే ప్రమాద ఘంటికలు మోగుతున్నట్టే.

విత్తనం కోసం ఎదురుచూపు

ఖరీఫ్ సాగు కోసం రైతులు పొలాలను దుక్కులు దున్ని సిద్ధం చేశారు. విత్తనకాయలను రాయితీపై ప్రభుత్వం పంపిణీ ప్రారంభిస్తే విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే ఇప్పటికీ విత్తనకాయలను పూర్తి స్థాయిలో మండల కేంద్రాలకు, ఇక్కడినుంచి గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలకు తరలించి రైతులకు అందించాల్సి ఉంది. జూన్ మొదటి వారంలోకి వచ్చినా ఇంకా విత్తనకాయల జాడలేదు. దీనితో రైతులు దుక్కులు దున్ని దిక్కులు చూస్తున్నారు.

విత్తన కాయల పంపిణీలో ఆలస్యం

రాయచోటి : దేవుడు కరుణించినా పూజారి వరమివ్వడు అన్న నానుడిని కూటమి ప్రభుత్వం గుర్తు చేస్తోంది. కోటి ఆశలతో ఖరీఫ్ సాగు కోసం ఎదురుచూసే రైతులకు దేవుడు కరుణించి అదను అనువుగా అనుకూలమైన వర్షాలు కురుస్తున్నాయి. అయితే సాగుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందివ్వాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం రైతుల పాలిట శాపం అయ్యింది. గత ఐదు సంవత్సరాలు వైఎస్ జగన్ పాలనలో సీజన్‌కు అనువుగా రైతు భరోసా నిధులను అందివ్వడంతో పాటు అవసరమైన వేరుశనగ, కంది, జీలుగ, ఉలవ తదితర రకాల విత్తనాలను సబ్సిడీపై అందించేది. కాగా ఖరీఫ్ సీజన్ వారం రోజుల్లో ప్రారంభం కానున్నా ప్రభుత్వం వైపు నుంచి అందాల్సిన రైతు సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. సబ్సిడీ విత్తనాల పంపిణీ దేవుడెరుగు కేటాయింపులే జరగకపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారింది.

జిల్లాలో రాయచోటి, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి, బి కొత్తకోట, వాల్మీకిపురం, రాజంపేట వ్యవసాయ డివిజన్‌లలో వీరబల్లి, సుండుపల్లి, మండలాల్లో వేరుశనగను విస్తారంగా సాగు చేస్తారు. రాజంపేట, కోడూరు నియోజకవర్గాలలో ఖరీఫ్‌లో తక్కువగాను రబీలో ఎక్కువగా పండిస్తారు.

ప్రశ్నించలేరా...?

జిల్లాకు కేటాయించిన విత్తనాలలో గత ఏడాదితో పోలిస్తే 15వేల క్వింటాళ్ల కోత పెట్టారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సొంత జిల్లాకే పెద్దఎత్తున కోత పెట్టడంతో ఆ శాఖ అధికారులే విస్తుపోతున్నారు. స్పందించాల్సిన జిల్లా ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న రైతుల నుంచి వినిపిస్తోంది. అసలు వీరికి ఈ సమస్యపై అవగాహన ఉందా అనేది అనుమానమే.

అదనపు కోటాకు ప్రతిపాదనలు

సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు కేటాయింపు తక్కువే. జిల్లాకు మరికొన్ని అదనపు సబ్సిడీ విత్తనకాయలు కావాలని ప్రతిపాదనలు పంపాము. ఉన్నతాధికారులకు జిల్లా సమస్యను వివరిస్తున్నాము. ప్రస్తుతం కేటాయింపులో ఐదువేల క్వింటాళ్లు విత్తనకాయలు జిల్లాకు చేరాయి. మిగిలిన కోటా విత్తనకాయలు రాగానే రైతులకు అందజేస్తాం. ఆలోపు అవసరమైన రైతుల నుంచి రిజిస్ట్రేషన్‌ను చేస్తున్నాం. ఈనెల 15 నుంచి సీజన్ ప్రారంభం అవుతుంది.

– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారాయణప్ప

కలకడ : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై కలకడ సమీపంలో మంగళవారం లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కలకడ ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని గొడసానివారిపల్లె గ్రామానికి చెందిన నారాయణప్ప (60) తన గ్రామ సమీపంలో పార్వతి పరమేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టాడు. చందాల కోసం సోమవారం రాత్రి కలకడకు చేరుకున్నాడు. మంగళవారం ఉదయం తిరిగి వెళుతుండగా రాయచోటి నుంచి పీలేరు వైపు వెళుతున్న లారీ ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన నారాయణప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రామాంజనేయులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని తమ్ముని కుమారుడు రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా



గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారి అప్పారాజుపేట వద్ద మంగళవారం సాయంత్రం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. జమ్మలమడుగు పట్టణానికి చెందిన రామయ్య కుటుంబ సభ్యులు దైవదర్శనం కోసం శ్రీకాళహస్తికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అప్పారాజుపేట వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. అటువైపు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, సీహెచ్ రమేష్, గల్లా శ్రీనివాసులు గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేషన్ షాపు సీజ్

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని అల్మాస్‌పేటలో ఉన్న 29వ రేషన్ షాపును సీజ్ చేసినట్లు ఆర్డీఓ జాన్ ఇర్విన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మనోజ్‌లు రేషన్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి మాట్లాడుతూ రేషన్ షాపులో 6,220 కిలోల బియ్యం ఉండాల్సి ఉండగా, కేవలం 1720 కిలోల బియ్యంతో పాటు చక్కెర ప్యాకెట్లు 417 ప్యాకెట్లు ఉండాల్సి ఉండగా, 430 ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనిపై సరైన సమాధానం చెప్పకపోవడంతో కేసు నమోదు చేసి రేషన్ షాపు సీజ్ చేశామన్నారు. రేషన్ షాపులో ఉన్న బియ్యంతోపాటు చక్కెరను వీఆర్‌ఓకు అప్పగించామన్నారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు వీఆర్‌ఓ ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేస్తామని తెలిపారు.

కూలిన ఇంటి పైకప్పు



మట్టి మిద్దె పైకప్పు కూలిన దృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని కె.రామిరెడ్డి పల్లె గ్రామంలో చప్పిడి వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన ఇంటి పై కప్పు ఉన్నట్లుండి కూలిపోయింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి రైతు వివరాల మేరకు ఇటీవల కురిసిన వర్షానికి ఇంటిపై కప్పులో ఉన్న చౌడు బాగా నానడంతో బరువుకు మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా కూలింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న లేగ దూడలపై మట్టి పడటంతో వెంటనే స్థానికుల సాయంతో బయటకు తీయడంతో వాటికి కూడా ప్రమాదం తప్పింది.

జవహర్ నవోదయలో విద్యాభ్యాసం..

ఉజ్వల భవిష్యత్తుకు సోపానం

- సీటు సాధిస్తే.. బంగారం లాంటి జీవితం
- ఆరవ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రణాళికాబద్ధంగా ఇష్టంతో చదివితే సీటు సొంతం
- జిల్లాలో రెండు జవహర్ నవోదయ విద్యాలయాలు



రాజంపేట మండలం నారమరాజుపల్లెలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయం

రాజంపేట టౌన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే చాలు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడినట్లే. అన్నమయ్య జిల్లాలో రెండు జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. అందులో ఒకటి రాజంపేట మండలం ఆకేపాడు పంచాయతీలోని నారమరాజుపల్లెలో, మరొకటి మదనపల్లె మండలం వలసపల్లెలో ఉంది. ఒక్కో విద్యాలయంలో ఆరవ తరగతిలో 80 సీట్లను భర్తీ చేసేందుకు ప్రతి ఏటా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాలకు చెందిన దాదాపు 10 వేల మందికి పైగా విద్యార్థులు ప్రతి ఏటా ప్రవేశ పరీక్షను రాస్తున్నారు. జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే క్రమశిక్షణతో కూడిన మెరుగైన విద్య లభించి తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రవేశ పరీక్షను రాయిస్తారు. అందువల్ల పోటీ తీవ్రంగా ఉంటుంది. పోటీకి తగ్గట్లు ప్రశ్నాపత్రం సరళి కూడా కొంత కఠినతరంగానే ఉంటుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో చదివిన విద్యార్థులకు రాజంపేటలోని నవోదయ విద్యాలయంలో, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదివిన విద్యార్థులకు మదనపల్లెలోని నవోదయ విద్యాలయంలో సీట్ల కేటాయింపు ఉంటుంది. కాగా ఓ ప్రణాళికాబద్ధంగా ఇష్టంతో కష్టపడి చదివితే సీటు సాధించడం పెద్దకష్టం కాదంటున్నారు విద్యావేత్తలు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా కేంద్రం కొన్ని దశాబ్దాల క్రితమే దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 1984వ సంవత్సరం మదనపల్లెలో, 1987వ సంవత్సరం రాజంపేటలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. మదనపల్లెకు చెందిన నవోదయ విద్యాలయం తొలుత హార్సిలీహిల్స్‌లో ఏర్పాటయింది. అనంతరం మదనపల్లె మండలం వలసపల్లెలో ఏర్పాటు చేశారు. క్రమశిక్షణతో మెరుగైన విద్యను అందించడం జవహర్ నవోదయ విద్యాలయాల ప్రత్యేకత. 2026–2027 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపల్ ఎం.గీత తెలిపారు.

దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు వీరే

- ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు.
- అలాగే ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదవ తరగతి తప్పని సరిగా చదివి ఉండాలి.
- ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా 2025–2026 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికే సీటు లభిస్తుంది.
- నోటిఫికేషన్‌లో పొందు పరిచిన విధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారికి సీట్లు కేటాయిస్తారు.
- గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదివిన వారికి 75 శాతం, పట్టణ ప్రాంత పాఠశాలల్లో చదివిన వారికి 25 శాతం సీట్ల కేటాయింపు ఉంటుంది.
- గతంలో పరీక్ష రాసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు.

ఇవీ ప్రయోజనాలు..

- నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి సీటు పొందిన విద్యార్థులకు 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌లో ఉచితంగా విద్య అందిస్తారు.
- మెరుగైన విద్యాబోధనతో పాటు మెరుగైన వసతి సౌకర్యం, నాణ్యమైన భోజనం, పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం అన్ని ఉచితంగా కల్పిస్తారు.
- విద్యార్థులకు వేర్వేరుగా వసతి, భోజన సౌకర్యం ఉంటుంది.
- విద్యాబోధన మాత్రం కంబైన్డ్ విధానంలో ఉంటుంది.
- కంప్యూటర్ కోర్సుతో పాటు ఎన్‌సీసీ, స్కౌట్ అండ్ గైడ్స్, సంగీతం, నృత్యం, డ్రాయింగ్, క్రాఫ్ట్, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

సీట్ల కేటాయింపు ఇలా..

- ఆరవ తరగతిలో 80 సీట్లు ఉంటాయి. ఈ సీట్ల భర్తీకే ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదలైంది.
- 80 సీట్లలో 60 సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులతో, 20 సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులతో భర్తీ చేస్తారు.

రిజర్వేషన్ సౌకర్యం ఇలా..

- బాలికలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది.
- గ్రామీణ ప్రాంత విద్యార్థుల సీట్ల భర్తీలో 9 సీట్లను ఎస్సీలతో, ఐదు సీట్లు ఎస్టీలతో భర్తీ చేస్తారు.
- పట్టణ ప్రాంత విద్యార్థుల సీట్ల భర్తీలో మూడు సీట్లు దివ్యాంగులకు, మూడు సీట్లు ఎస్సీలకు, ఒక సీటు ఎస్టీలతో భర్తీ చేస్తారు.

పరీక్షా విధానం ఇలా..

- మొత్తం నూరు మార్కులకు పరీక్ష ఉంటుంది.
- మెంటల్ ఎబిలిటీ, గణితం, పేరాగ్రాఫ్స్ ఇలా మూడు విభాగాల్లో 80 ప్రశ్నలు ఉంటాయి.
- మెంటల్ ఎబిలిటీకి (మేధాశక్తి)కి సంబంధించి 50 మార్కులకు గాను 40 ప్రశ్నలు పది భాగాల్లో ఉంటాయి. ఒక్కో భాగంలో నాలుగు ప్రశ్నలు దయాగ్రమ్స్ రూపంలో ఉంటాయి.
- గణితంకు సంబంధించి 25 మార్కులకు 20 ప్రశ్నలు ఉంటాయి.
- పేరాగ్రాఫ్స్‌కు సంబంధించి 25 మార్కులకు 20 ప్రశ్నలు ఉంటాయి.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ 29–7–2025
- ప్రవేశ పరీక్ష తేదీ – 13–12–2025

ఆరునెలలు ఆటలను కట్టిపెట్టాలి



విద్యార్థులు ఆరునెలల పాటు ఆటలు కట్టి పెట్టి సమయాన్ని వృథా చేసుకోకుండా కష్టపడి చదివితే నవోదయ విద్యాలయంలో సీటు సాధించవచ్చు. నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుంది. టెన్త్‌లో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎంతటి శ్రద్ధ తీసుకుంటారో అంత కన్నా ఎక్కువగా నవోదయ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని ఒక ప్రణాళికాబద్ధంగా చదివిస్తే తప్పక సీటు లభిస్తుంది. నవోదయ విద్యాలయంలో విద్యార్థులు సీటు సాధించాలంటే తల్లిదండ్రుల పాత్ర అత్యంత ముఖ్యమైనది.

– కొండూరు రఘునాథరాజు, ఎంఈఓ, రాజంపేట

ఈ 'పాప'ం ఎవరిది!



గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన చిన్నారి

రాయచోటి జగదాంబసెంటర్ : మూడు రోజుల క్రితం జన్మించిన మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు గోనె సంచిలో తీసుకొచ్చి గడ్డివామి వద్ద వదిలేసి వెళ్లారు. ఈ సంఘటన వీరబల్లి మండలం వంగిమళ్ల పంచాయతీ పెద్ద దళితవాడ వద్ద మంగళవారం వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి పి.రమాదేవి చిన్నారికి వైద్య పరీక్షలు చేయించి రాయచోటిలోని శిశు గృహలో ఉంచారు. చిన్నారికి సంబంధించిన తగిన ఆధారాలతో 30 రోజుల్లోగా తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. లేనిపక్షంలో ఈ బిడ్డను అనాథగా ప్రకటించి ప్రభుత్వ షరతులు, నియమాల ప్రకారం మరొకరికి దత్తత ఇస్తామని తెలిపారు.

నీటి తొట్టిలో పడి బాలిక మృతి



బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి

రాజంపేట : మండలంలోని ఆకేపాడు కట్టకిందపల్లెలో మల్లిక (8) అనే బాలిక మంగళవారం ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి బాలిక మృతదేహాన్ని చూసి చలించిపోయారు. మృతురాలి తండ్రి శ్రీధర్‌రెడ్డిని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాలిక మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన విజయలక్ష్మి

పీలేరు రూరల్ : కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లె వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంబేపల్లె మండలం దుద్యాల పంచాయతీ పెద్ద జంగంపల్లెకు చెందిన పి. విజయలక్ష్మి(55) మంగళవారం సాయంత్రం వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలో ఉన్న తమ కుమార్తె అంజనమ్మ ఇంటికి వెళ్లేందుకు పీలేరులో ఆటో ఎక్కింది. జంగంపల్లె వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా మదనపల్లె వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. అదే కారులో ఆమెను పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు



గాయపడిన ఫారుక్, లక్ష్మీనారాయణ, చలపతి

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన స్నేహితులు ఫారూక్(20), చైతన్య(19) ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట మండలం హార్సిలీ హిల్స్‌కు వెళ్లేందుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి రెండు ద్విచక్ర వాహనాల్లో బయలుదేరారు. మార్గమధ్యంలోని ములకలచెరువు మండలం బురకాయలకోట వద్దకు రాగా, ద్విచక్ర వాహనం నడుపుతున్న ఫారూక్‌కు, ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి ఇద్దరు కింద పడ్డారు. చైతన్య గాయపడగా ఫారుక్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి వెళ్లాడు. స్థానికులు బాధితులు ఇద్దరిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఫారుక్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అదేవిధంగా ములకలచెరువు పట్టణంలోని షాపులో పనిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీనారాయణ (50) వ్యక్తిగత పనులపై కదిరి పట్టణానికి వెళ్లి తిరిగి ఆర్టీసీ బస్సులో ములకలచెరువుకు వస్తుండగా, మార్గమధ్యంలోని చీకటిమాను పల్లె వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో దాదాపు పది మందికి పైగా గాయపడగా, లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వారు వేర్వేరు ఆసుపత్రులకు వెళ్లగా, లక్ష్మీనారాయణను స్థానికులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతి రుయాకు పంపారు. మదనపల్లె మండలం మాలేపాడుకు చెందిన చలపతి(60), మంగళవారం ద్విచక్ర వాహనంలో చౌడేపల్లి మండలం బోయకొండ పుణ్యక్షేత్రానికి వెళ్లాడు. తమ గ్రామానికి చెందిన సురేష్(30)తో కలిసి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని కృష్ణాపురం వద్ద కర్ణాటకకు చెందిన కారు వెనుకనుంచి ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నయ్య

సిద్దవటం : రోడ్డు దాటుతున్న దంపతులను గుర్తు తెలియని వాహనం ఢీకొడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దవటం మండలం భాకరాపేట గ్రామానికి చెందిన నల్లగొండు చెన్నయ్య, ఆయన భార్య వెంకటమ్మ ఇరువురు సోమవారం రాత్రి భాకరాపేట గ్రామ శివారులోని శివాలయం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొంది. దీంతో చెన్నయ్య తలకు గాయం కాగా, వెంకటమ్మకు ఎడమ కాలు విరిగింది. 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఢీకొన్న వాహనం ఆచూకీ కోసం సమీప ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామన్నారు. హైవే రోడ్డు దాటేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండి వాహనాల రాకపోకలను గమనించి రోడ్డు దాటాలని ఎస్‌ఐ సూచించారు.

తండ్రి, కుమార్తెపై దాడి

మదనపల్లె రూరల్ : ఒంటరి మహిళను బలవంతం చేసిన విషయం నిలదీసినందుకు తండ్రి, కుమార్తెపై దాడిచేసిన ఘటన మదనపల్లె మండలంలో సోమవారం రాత్రి జరిగింది. వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన హరిబాబు భార్య రెడ్డెమ్మ(30) ఆరేళ్ల క్రితం భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలతో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. సోమవారం సాయంత్రం కూలిపనులకు వెళ్లి తిరిగి వచ్చి ఇంటిలో ఉండగా, అదే గ్రామానికి చెందిన విజయభాస్కర్, ఆమె ఇంట్లోకి చొరబడి రెడ్డెమ్మను బలవంతం చేశాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయం బాధితురాలు తన తండ్రి చిలకవారిపల్లెలో ఉంటున్న రమణయ్యకు తెలపగా, ఆయన మొలకలదిన్నెకు బంధువులతో కలిసి వచ్చి విజయభాస్కర్‌ను నిలదీయగా, అతను రమణయ్య, రెడ్డెమ్మలపై దాడిచేసి కొట్టాడు. గాయపడిన బాధితులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఇదే ఘటనలో తాను గాయపడ్డానని విజయభాస్కర్, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి రాగా స్థానిక వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడకు వెళ్లిన కొద్దిసేపటికే తిరుపతిలోని రుయా వైద్యులు అతడిని డిశ్చార్జి చేశారు. ఘటనపై బాధితురాలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి

ఏయూ అచీవర్స్‌డేలో చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అన్నమాచార్య యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థులు ఉద్యోగాలు పొందడమే కాకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీలో అచీవర్స్‌డే –2025ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయం సాధించాలంటే నిరంతరం కృషి చేయాలన్నారు. ఇందులో తల్లిదండ్రుల పాత్ర గొప్పదన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి సునీల్ అల్లువాడ మాట్లాడుతూ ఎన్నో కంపెనీల్లో విద్యార్థులు ఎంపిక కావడమే కాకుండా, ఇంటర్న్‌షిప్‌లో కూడా పాల్గొన్నారన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నిబద్ధత, మానవతా విలువలు గర్వించదగ్గవన్నారు. వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ ఖ్యాతి విద్యార్థుల ప్రతిభపైనే ఆధారపడి ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జునరావు, ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్స్ జేఎన్‌టీయూ(అనంతపురం) ప్రొఫెసర్ కిరణ్మయి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమకేశవులు, వివిధ విభాగాల డీన్‌లు, శాఖాధ్యక్షులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థినులకు ఉచిత విద్య

కడప కల్చరల్ : గ్రామీణ ప్రాంతాలలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన పేద విద్యార్థినులు ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి ముగించుకుని ఎనిమిదవ తరగతిలో ప్రవేశించే వారికి ఉచిత విద్యను అందిస్తున్నట్లు కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. అర్హత కలిగిన రెడ్డి సామాజిక పేద విద్యార్థినులు ఎనిమిదవ తరగతిలో ప్రవేశం కోసం 2025 జూన్ 15వ తేదీ లోపల కడప నగరం రాజీవ్ మార్గ్ రెడ్డి సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవలసిందిగా కోరారు. పూర్తి వివరాలకు 9440523484, 9440651284, 9989465956 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

టీడీపీ వారి గొడవను వైఎస్సార్‌సీపీకి రుద్దడం తగదు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనందరెడ్డి

రాయచోటి టౌన్ : మట్టిని అక్రమంగా తరలించే క్రమంలో టీడీపీలోని ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగితే దానిని కూడా వైఎస్సార్‌సీపీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కంచాలమ్మ గండిలో అక్రమంగా మైనింగ్, మట్టి తరలించేందుకు టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. కంచాలమ్మ గండిలో జేసీబీతో మట్టిని తవ్వే విషయంలో సుబ్బారెడ్డి, గంగిరెడ్డి మధ్య గొడవ జరిగిందన్నారు. దీంతో జేసీబీ డ్రైవర్, యజమాని అయిన పవన్ అక్కడి నుంచి నిష్క్రమించాడని చెప్పారు. అయినా ఇంటి వద్ద ఉన్న పవన్‌పై గంగిరెడ్డి కొడవలితో దాడికి దిగాడన్నారు. దీనిపై పోలీసులకు పవన్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. మట్టి తరలింపు కోసం గొడవ పడిన వారు ఇద్దరు టీడీపీకి చెందిన వారే కాగా, పవన్ ఇంటిపైకి వెళ్లి దాడి చేయడం తప్పన్నారు. అయితే ఈ కేసును వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అంటగట్టడం తగదన్నారు.

చెస్ క్రీడాకారులకు అంతర్జాతీయ ఫిడే రేటింగ్



చెస్‌లో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించిన రవి వసంత కుమార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ చెస్ క్రీడాకారులు అంతర్జాతీయ ఫిడే చెస్ రేటింగ్‌లను సాధించడం గర్వకారణమని జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్ దర్బారి పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ మైదుకూరుకు చెందిన రవి వసంత కుమార్ తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూర్ అలాగే ఢిల్లీలో నిర్వహించిన రెండు ఫిడే క్లాసికల్ రేటింగ్ టోర్నమెంట్లలో పాల్గొని తన అద్భుతమైన ప్రదర్శనతో 1452 క్లాసికల్ ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్‌ను పొందారన్నారు. ప్రస్తుతం ఆయన కాశినాయన మండలం, ఇటుకలపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారన్నారు.

అలాగే ప్రొద్దుటూరుకు చెందిన నదీమ్ సాహెబ్ గారి ముజమ్మిల్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఫిడే రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని 1491 రాపిడ్ ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్‌ను పొందారన్నారు. ఈ ఇద్దరు క్రీడాకారుల ఫిడే రేటింగులను ఫిడే అంతర్జాతీయ చెస్ సమాఖ్య తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ నెల 1వ తేదీన ప్రకటించిందన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి

రాజంపేట : తనపై శవనవారిపల్లెకు చెందిన కొందరు దాడి చేసినట్లు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారాజు మంగళవారం మీడియా ఎదుట ఆరోపించారు. సోమవారం రాత్రి ఇంట్లోకి చొరబడి రాడ్లతో దాడి చేశారన్నారు. గొడవను శక్తి యాప్‌లో చిత్రీకరిస్తుంటే మొబైల్ ఫోన్‌ను దౌర్జన్యంగా లాక్కొని ధ్వంసం చేశారన్నారు. ఉపాధి పనులకు రాకపోయినా తమ పేరు నమోదు చేసి బిల్లు పెట్టాలంటూ గొడవకు దిగారన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారన్నారు. తనకు రక్షణ కల్పించాలని కోరారు.